క్లుప్తంగా

పోలింగ్ బూత్‌ల నిర్వహణపై అవగాహన



రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహిస్తున్న తహసీల్దార్ అజయ్‌బాబు

గోపాలపురం: గోపాలపురం అసెంబ్లీ నియోజకవర్గంలోని నాలుగు మండలాలలో పోలింగ్ బూత్‌లు, వాటి వివరాలను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుతున్నట్లు తహసీల్దార్ అజయ్‌బాబు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం వివిధ రాజకీయ పార్టీ నాయకులతో పోలింగ్ బూత్‌ల నిర్వహణపై చర్చించారు. పోలింగ్ బూత్‌ల వివరాలు ఆయా గ్రామాల బూత్ లెవెల్ అధికారుల వద్ద ఉంటాయని పార్టీ నాయకులకు ఎటువంటి సందేహాలు ఉన్నా నివృత్తి చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ డీటీ కాట్రు నల్లరాజు, సీనియర్ అసిస్టెంట్ సునీత, నాయకులు వెలగా శ్రీరామమూర్తి, దొడ్డిగర్ల సువర్ణరాజు, కొర్లపాటి శ్రీరామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహ సంక్షేమాధికారి సరోజకు సత్కారం



సరోజకు పురస్కారం అందజేస్తున్న మంత్రి సవిత

నిడదవోలు రూరల్: మండలంలోని సమిశ్రగూడెం బీసీ బాలికల వసతిగృహం సంక్షేమాధికారి పి.సరోజ రాష్ట్రస్థాయి పురస్కారాన్ని గురువారం అందుకున్నారు. 2024–25 విద్యా సంవత్సరంలో బీసీ బాలికల వసతిగృహంలో పదో తరగతి విద్యార్థినులు 26 మంది పరీక్ష రాయగా నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ మేరకు విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన ప్రదానోత్సవ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ సరోజకు మంత్రి సవిత బెస్ట్ వార్డెన్ పురస్కారం అందజేసి సన్మానించారు. ఈసందర్భంగా ఆమెను నిడదవోలు తాలూకా ఏపీఎన్జీవోస్ అధ్యక్షులు కె.నందీశ్వరుడు, కార్యదర్శి జె.జయంతి, వార్డెన్లు అభినందించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నిడదవోలు రూరల్: పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సమిశ్రగూడెం ఎస్సై కె.వీరబాబు గురువారం తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం నిడదవోలు మండలం పురుషోత్తపల్లి గ్రామానికి చెందిన తణుకు మోహన్‌కృష్ణ (31) వాహన డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో గత వారం రోజులుగా మోహనకృష్ణ మద్యం సేవిస్తున్నాడని, ఈనెల 14న తీవ్ర మనస్తాపంతో పురుగుల మందు తాగాడన్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి అత్యవసర వైద్యసేవలు అందిస్తుండగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు చెప్పారు. భార్య పూర్ణ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వీరబాబు పేర్కొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

గోపాలపురం: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని గోపాలపురం ఎంపీడీఓ కె శ్రీనివాస్ అన్నారు. స్థానిక బొల్లేరు చెరువు వద్ద గురువారం ఉపాధి కూలీలకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఎంఆర్‌సీ నీడ బాబూరావు, ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ మాధవి పాల్గొన్నారు.

వేసవి శిబిరాలను వినియోగించుకోవాలి

నల్లజర్ల: బాలల్లో సృజనను వెలికితీసేందుకు వేసవి శిబిరాలు దోహదపడతాయని రీసోర్సు పర్సన్ ఎస్‌కే.ఖాన్ బాజీ అన్నారు. గురువారం ఆయన శిబిరంలో విద్యార్థులకు గణితాన్ని సులభ పద్ధతులను వివరించారు. విద్యార్థులు చదువులలో రాణించేందుకు ఈ శిబిరాలు దోహదపడతాయన్నారు.

డ్రోన్ వినియోగం.. వ్యవసాయ రంగానికి వరం

- విప్లవాత్మక మార్పులకు నాంది
- ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు విరివిగా వినియోగిస్తున్న వైనం
- ఏయూ జియో ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సర్టిఫికెట్ కోర్సుగా నిర్వహణ
- కోర్సులో చేరేందుకు విద్యార్థుల ఆసక్తి



భూముల సర్వేకు రెవెన్యూ శాఖ వినియోగిస్తున్న డ్రోన్



అభ్యుదయ రైతు నాగమల్లికార్జునరావుకు సర్టిఫికెట్ అందిస్తున్న వ్యవసాయశాఖ జేడీ మాధవరావు(ఫైల్)

నల్లజర్ల: డ్రోన్‌ల వినియోగంతో సేవలు సులభతరంగా మారుతున్నాయి. భూముల సర్వేలు, రక్షణరంగ అవసరాలు, వ్యవసాయ రంగంలో డ్రోన్‌లను విస్తృతంగా వినియోగిస్తుండడం శుభపరిణామం. ఎన్నో ప్రైవేటు సంస్థలు సైతం వీటి సేవలను వినియోగించుకుంటున్నాయి. వీటి ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకొని ఆంధ్ర విశ్వవిద్యాలయం డ్రోన్‌లపై రాష్ట్రంలోనే తొలిసారిగా సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించింది. ఏయూ జియో ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సర్టిఫికెట్ కోర్సు నిర్వహణకు శ్రీకారం చుట్టారు. జియో ఇంజినీరింగ్, బీటెక్, ఎంటెక్ చదువుతున్న విద్యార్థులు సైతం ఈ కోర్సులో చేరారు. ఏయూ జియో ఇంజినీరింగ్ విద్యార్థులకు దీనిపై కొంత అవగాహన ఉండటంతో 30 రోజుల శిక్షణ సరిపోతుంది.

వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ డ్రోన్ పైలట్ ట్రైనింగ్ సెంటర్‌ను గుంటూరు జిల్లా తాడేపల్లిలో ఏర్పాటు చేశారు. ఈ సంస్థ ఇస్తున్న శిక్షణలో తూర్పుగోదావరి జిల్లా నుంచి 30 మంది హాజరు కాగా నల్లజర్ల మండలం అనంతపల్లి నుంచి అభ్యుదయ రైతు తమ్మిశెట్టి నాగ మల్లిఖార్జునరావు శిక్షణ పొందారు. వ్యవసాయశాఖ ద్వారా డ్రోన్ పొందాలంటే 5గురు రైతులు గ్రూపుగా ఏర్పడాలి. అందులో ఒకరు ఇంటర్ పాసై ఉండాలి. అతనిని శిక్షణకు ఎంపిక చేస్తారు. పాస్ట్‌పోర్టు సైతం విధిగా ఉండాలి. అతనికి కిసాన్ డ్రోన్ ప్రోగ్రాం డిగ్రో డ్రోన్స్‌లో రెసిడెన్షియల్ శిక్షణ ఇస్తారు. అనంతరం సర్టిఫికెట్ అందిస్తారు. రూ.8 లక్షల నుంచి 10 లక్షల వరకు డ్రోన్ కొనుగోలుకు ఖర్చవుతుంది. అందులో 40శాతం రాయితీ ఉంటుంది. ప్రమాదాలు జరిగినప్పుడు పరిహారం అందించే విధంగా థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్ సైతం చేస్తారు.

వ్యవసాయ రంగానికి ఎంతో మేలు



డ్రోన్ సర్వే ఆఫ్ మ్యాపింగ్ వ్యవసాయ రంగానికి ఎంతో మేలు చేస్తుంది. నీటి లభ్యత, ఎంత పరిమాణంలో నీటిని వాడాలి, ఎరువులు ఏ మోతాదులో వాడాలి తదితర వివరాలు దీనివల్ల కచ్చితంగా తెలుస్తుంది. రైతుకు నీటి, ఎరువుల ఆదా, కూలీ ఖర్చులు తగ్గుతాయి. మండలానికి మరో రెండు డ్రోన్‌లు ఇవ్వడానికి అవకాశం ఉంది. ఆధునిక పద్ధతుల ద్వారా సాగుచేసే అభ్యుదయ రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

కె.కమల్‌రాజ్, మండల వ్యవసాయాధికారి, నల్లజర్ల.

డబ్బు, సమయం ఆదా అవుతోంది



సాధారణంగా 3 ఎకరాలకు వినియోగించే మందు ద్రావణం డ్రోన్ వినియోగం ద్వారా 5 ఎకరాలకు సరిపోతుంది. అదేవిధంగా సమయంతో పాటు కూలీ ఖర్చు సైతం ఆదా అవుతుంది. ప్రస్తుతం కూలీల కొరత తీవ్రంగా ఉంది. దీనిని అధిగమించేందుకే మా గ్రూపు సభ్యులు డ్రోన్ కొనుగోలుకు నిర్ణయించాం.

టి.నాగ మల్లిఖార్జునరావు, డ్రోన్ శిక్షణ పొందిన రైతు, అనంతపల్లి.

శిశువు వైద్యానికి రూ.4 లక్షలు మంజూరు

నిడదవోలు : మండలంలోని కోరుమామిడి గ్రామానికి చెందిన పసలపూడి నాగచంద్రానికి ఈనెల11వ తేదీన గుండె, ఊపిరితిత్తుల సంబంధిత సమస్యతో కుమార్తె (శిశువు) జన్మించింది. శిశువుకు అత్యవసర వైద్య చికిత్స చేయించాలని వైద్యులు నిర్ధారించారు. వైద్యం కోసం రూ.4 లక్షలు ఖర్చవుతోందని వైద్యులు చెప్పారు. నాగచంద్రం కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పందించారు. ఆలస్యం చేయకుండా సంబంధిత ఆరోగ్యశాఖ అధికారులతో మంత్రి దుర్గేష్ స్వయంగా మాట్లాడారు. శిశువు వైద్య ఖర్చులకు రూ. 4 లక్షల ఎల్‌వోసీ మంజూరు చేయించారు. దీంతో శిశువు తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

ధాన్యం కొనుగోలు ప్రక్రియ పరిశీలన

నిడదవోలు రూరల్: రబీలో పండించిన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని తహసీల్దార్ బి.నాగరాజు నాయక్ తెలిపారు. నిడదవోలు, సమిశ్రగూడెం, తిమ్మరాజుపాలెం గ్రామాల్లోని రైస్‌మిల్లులలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను తహసీల్దార్ నాగరాజు నాయక్ గురువారం పరిశీలించారు. తేమ, నూకశాతం వంటి కారణాలతో రైతులను ఇబ్బందిపెడితే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆర్ఐ సత్యేంద్ర, వీఆర్వోలు పాల్గొన్నారు.

మాంసం దుకాణాల ట్రేడ్ లైసెన్స్‌ల పరిశీలన

సాక్షి ఇంపాక్ట్



పట్టణంలోని మాంసం దుకాణాల్లో ట్రేడ్ లైసెన్స్‌లను పరిశీలిస్తున్న మున్సిపల్ శానిటేషన్ కార్యదర్శులు

నిడదవోలు : పట్టణంలో పొట్టేళ్ల మాంసం దుకాణాలను గురువారం మున్సిపల్ శానిటేషన్ కార్యదర్శుల బృందం తనిఖీలు చేపట్టారు. ఆరోగ్యకరమైన జీవాలు అని పశువైద్యాధికారి ముద్ర లేకుండా వ్యాపారులు ప్రజలకు విక్రయిస్తున్న వైనాన్ని వివరిస్తూ 'ఏదీ ముద్ర' అనే శీర్షికన ఈనెల 15న సాక్షిలో ప్రచురించిన కథనానికి మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి స్పందించారు. మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు మున్సిపల్ శానిటేషన్ కార్యదర్శులు పట్టణంలో మటన్ దుకాణాలలో తనిఖీలు చేపట్టారు. దుకాణాల వద్ద పారిశుధ్య స్థితిగతులను పరిశీలించారు. పట్టణంలో నాలుగు మటన్ దుకాణాలకు మాత్రమే గతంలో మున్సిపల్ ట్రేడ్ లైసెన్స్‌లు ఇచ్చారు. ఇవి కాకుండా ట్రేడ్ లైసెన్స్‌లు లేకుండా మాంసం విక్రయాలు జరుపుతున్న ఏడు దుకాణాలను అధికారులు గుర్తించారు. వీరిలో ముగ్గురు వ్యాపారులతో ట్రేడ్ లైసెన్స్‌కు దరఖాస్తు చేయించారు. పట్టణంలో ట్రేడ్ లైసెన్సులు లేని వ్యాపారులను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. జనావాసాల మధ్య ఉన్న మటన్ దుకాణాలకు ఎన్‌వోసీ సర్టిఫికెట్స్ తీసుకున్న తరువాతే వ్యాపారులకు ట్రేడ్ లైసెన్సులు జారీ చేస్తామని అధికారులు స్పష్టం చేశారు.

ట్యాంకర్‌తో గోదావరి నీటి సరఫరా

గ్రామస్తులకు ఉచితంగా అందిస్తున్న యువకుడు



వేగేశ్వరపురంలో గోదావరి నీటిని ట్యాంకర్ ద్వారా అందజేస్తున్న కృష్ణమూర్తి

తాళ్లపూడి: గ్రామస్తులకు గోదావరి నీటిని ట్రాక్టర్ ట్యాంకర్ ద్వారా ఉచితంగా సరఫరా చేస్తున్నాడు గ్రామానికి చెందిన యువకుడు అంబటి కృష్ణమూర్తి. మండలంలోని వేగేశ్వరపురంలో గోదావరి నది నుంచి నేరుగా తెచ్చుకున్న నీటిని తాగడానికి ఎక్కువ మంది మక్కువ చూపుతారు. మండల స్థాయిలో శుద్ధి చేసిన గోదావరి జలాలు పంపిణీ చేస్తున్నప్పటికీ, ఈ నీటి వల్ల కాళ్ల నొప్పులు వస్తున్నాయని కొందరు అంటున్నారు. ఈ క్రమంలో గోదావరి నుంచి నేరుగా తెచ్చుకునే నీటిపైనే గ్రామస్తులు ఆధారపడుతున్నారు. వేసవి దృష్ట్యా ఎండలో వెళ్లి గోదావరి నీళ్లు తెచ్చుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో కృష్ణమూర్తి స్వచ్ఛందంగా ముందుకువచ్చి తన ట్రాక్టర్ ట్యాంకర్‌తో మూడు వారాలుగా గ్రామస్తులకు గోదావరి నీటిని ఉచితంగా పంపిణీ చేస్తున్నాడు. వేసవి అంతా సరఫరా చేస్తానని ఆయన చెప్పారు. తన తండ్రి సూర్యారావు జ్ఞాపకార్థం ఈ సేవ చేస్తున్నట్టు తెలిపారు.

'కూటమి పాలన అవినీతిమయం'

- కుట్టుమిషన్ శిక్షణ ముసుగులో నాయకుల దోపిడీ
- మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ధ్వజం



చాగల్లులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

చాగల్లు: కూటమి ప్రభుత్వం కుట్టు మిషన్ శిక్షణ ముసుగులో భారీ స్కాంకు పాల్పడుతోందని వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో అంతటా అవినీతి రాజ్యమేలుతోందని చివరకు మహిళలకు వృత్తి నైపుణ్యాలను అందించే కార్యక్రమంలో సైతం అవినీతికి పాల్పడుతున్నారని మండిపడ్డారు. చాగల్లులో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బీసీ, ఈబీసీ, కాపు మహిళలకు కుట్టు శిక్షణ, మిషన్ల పంపిణీ కార్యక్రమంలో ఏకంగా రూ.167 కోట్ల సొమ్మును దోచుకుంటున్నారని విమర్శించారు. ప్రభుత్వ రంగ శిక్షణ సంస్థలను కాదని.. కూటమి నేతలు వారికి అనుకూలమైన వ్యక్తులకు నిబంధనలకు విరుద్ధంగా టెండర్లను కట్టబెట్టారని ఆరోపించారు. రూ.257 కోట్ల విలువైన ఈ కార్యక్రమంలో మొత్తం సొమ్మును దోచుకునేందుకు కుట్ర పన్నారని మండిపడ్డారు. ఎన్నికల హామీలను అమలు చేయకుండా మహిళలను దగా చేస్తున్న ప్రభుత్వం.. ఇప్పుడు వారి కోసం కేటాయించిన సొమ్మును సైతం కాజేస్తూ దారుణంగా మోసం చేస్తోందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలోని రెండున్నర కోట్ల మందికి పైగా మహిళలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఒక్కటీ కూడా ఇప్పటివరకు అమలు చేయలేదని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ అన్నారని.. నేడు సూపర్ స్కామ్స్ చేస్తున్నారని దుయ్యబట్టారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

దేవరపల్లి: మండలంలోని దుద్దుకూరులో ఆర్‌డీడీఎస్ పనులు జరుగుతున్నందున శుక్రవారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ నిడదవోలు ఆపరేషన్ ఈఈ ఎస్.నారాయణ అప్పారావు తెలిపారు. 33/11 కేవీ దేచర్ల సబ్ స్టేషన్ నుంచి 11 కేవీ దుద్దుకూరు రూరల్ ఫీడర్‌లో సరఫరాను నిలుపుదల చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

గోపాలపురం: గోపాలపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ సత్యసాయి ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలో చెట్ల తొలగింపు నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకూ విద్యుత్ నిలుపుదల చేయడం జరుగుతుందని నిడదవోలు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్ నారాయణ అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలోని వినియోగదారులు సహకరించాలని కోరారు.

రోడ్డెక్కిన అన్నదాతలు

- పంగిడి– నిడదవోలు రోడ్డుపై బైఠాయించి నిరసన



చాగల్లులో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపిన రైతులు

చాగల్లు: తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణం పరిష్కారం చేయాలని కోరుతూ ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో పంగిడి– నిడదవోలు రోడ్డుపై బైఠాయించి గురువారం రైతులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు ఎం.సుందర్‌బాబు మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తీవ్ర మనోవేదనలో ఉన్నారని తమ ధాన్యాన్ని మిల్లులకు తోలి 20 రోజులు దాటుతున్నా ప్రభుత్వం ఆన్‌లైన్ చేయకుండా డబ్బులు చెల్లించకుండా కాలయాపన చేస్తుందని మండిపడ్డారు. రబీ ధాన్యం కొనుగోలు లక్ష్యం పెంచి రైతులు, కౌలు రైతుల వద్దనున్న ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రబీ ధాన్యం కొనుగోలు లక్ష్యం పూర్తయిందని కొనుగోళ్లు నిలిపివేయడం వలన రైతులు, కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మిల్లర్లు, ప్రైవేటు వ్యాపారులు కూడా ధాన్యం కొనే పరిస్థితి లేదన్నారు. కొనుగోలు లక్ష్యం నిర్దేశించి ఆ మేరకే కొనుగోలు చేయడం వలన రైతు పండించిన ప్రతి గింజ కొనుగోలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు కావడం లేదన్నారు.

ఈ కార్యక్రమంలో చాగల్లు, మార్కొండపాడు, బ్రాహ్మణగూడెం, ఉనగట్ల తదితర గ్రామాల నుంచి రైతులు పాల్గొన్నారు. రైతు సంఘం నాయకులు కంకటాల విశ్వేశ్వరరావు, గద్దె రాయుడు, సీఐటీయూ నాయకులు కేకే దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

అపర భగీరథుడు ఆర్థర్ కాటన్



కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురళీకృష్ణరాజు, ఉద్యోగులు

నిడదవోలు : కరువు కాటకాలతో రైతులు నానా అవస్థలు పడుతున్న సమయంలో సర్ ఆర్థర్ కాటన్ కృషితో ఉభయ గోదావరి డెల్టాల పంట భూములు సస్యశ్యామలయ్యాయని పశ్చిమగోదావరి జిల్లా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కె.మురళీకృష్ణరాజు అన్నారు. పట్టణ శివారు శెట్టిపేట నీటిపారుదల ఎగ్జిక్యూటివ్ కార్యాలయంలో గురువారం సర్ ఆర్థర్ కాటన్ 222వ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యాలయ ఆవరణలో ఉన్న కాటన్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నీటి పారుదల శాఖ ఎస్ఈ పి.నాగార్జునరావు మాట్లాడుతూ గోదావరి డెల్టా పరిధిలో అపర భగీరథుడు కాటన్ మహాశయుడు సంకల్పంతో గోదావరి నదికి నిర్మించిన ఆనకట్ట ద్వారా ఉభయ గోదావరి జిల్లాలలో బీడు భూములను పంట భూములుగా మార్చి రైతులను కరువు బారినుండి కాపాడారని కాటన్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ డివిజన్ టెక్నికల్ అధికారి, ఏపీ ఎన్జీవోల అసోషియేషన్ అధ్యక్షుడు కె.నందీశ్వరుడు. డీఈ ఎ.ముందేష్, సూపరింటెండెంట్ కె.నాగేశ్వరరావు, బి. కిషోర్, ఇరిగేషన్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాటన్ చిరస్మరణీయుడు

ఉండ్రాజవరం: ప్రజల హృదయాల్లో సర్ ఆర్థర్ కాటన్ చిరస్థాయిగా నిలిచి ఉంటారని జలవనరుల శాఖ గోడిచర్ల లాక్ సూపరింటెండెంట్ ముప్పిడి విజయ్‌కుమార్ అన్నారు. సర్ ఆర్థర్ కాటన్ 222వ జయంతి సందర్భంగా మండలంలోని పసలపూడి గ్రామంలో గోడిచర్ల లాక్ వద్ద గురువారం ఆయన కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో లస్కర్ సిబ్బంది పాల్గొన్నారు.

వేతన ఒప్పందం చర్చలు విఫలం

- కొనసాగుతున్న పొక్లెయిన్ ఆపరేటర్ల సమ్మె



చర్చలు విఫలం కావడంతో బయటకు వస్తున్న కార్మిక సంఘం నాయకులు

దేవరపల్లి: క్వారీల్లో పనిచేస్తున్న పొక్లయిన్ ఆపరేటర్ల నూతన వేతన ఒప్పందం గురించి గురువారం మండలంలోని గౌరీపట్నంలోని కల్యాణ మండపంలో ది వెస్ట్ గోదావరి క్వారీ క్రషర్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులకు, కార్మిక సంఘాల నాయకులకు మధ్య చర్చలు జరిగాయి. ఈ చర్చల్లో ఆపరేటర్‌కు ప్రస్తుతం ఇస్తున్న నెల వేతనంపై అదనంగా రూ.3,300 ఇవ్వాలని కార్మిక సంఘాల నాయకులు ప్రతిపాదన చేశారు. ప్రస్తుతం ప్రాంతాన్ని బట్టి ఆపరేటర్‌కు నెలకు రూ.16 నుంచి 20 వేలు వేతనం ఇస్తున్నందున దీనిపై అదనంగా రూ.3300 ఇవ్వాలని నాయకులు డిమాండ్ చేశారు. దీనికి యజమానులు నిరాకరించారు. క్వారీ పరిశ్రమ ఇబ్బందుల్లో ఉన్నందున ప్రస్తుత పరిస్థితిలో రూ. 3300 పెంచలేమని, రూ. 1000 ఇస్తామని యజమానులు తెలిపారు. దీనికి కార్మిక సంఘాల నాయకులు అంగీకరించకపోవడంతో రెండు, మూడు రోజుల్లో యజమానులంతా ఆలోచించి మరలా చర్చలకు పిలుస్తామని కార్మికులకు తెలిపారు. ఈ చర్చల్లో ది వెస్ట్ గోదావరి జిల్లా క్వారీ క్రషర్ల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఆంద్రు అనీల్, ఉపాధ్యక్షులు ముదునూరి సూర్యనారాయణరాజు, పేపకాయల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి దోనెల్లి మధుబాబు, కోశాధికారి కోట్ల కనకేశ్వరరావు, పలువురు యజమానులు, పొక్రెన్ ఆపరేటర్లు, ఐఎఫ్‌టీయూ నాయకులు పాల్గొన్నారు.

నిప్పుల కొలిమి

- ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు



నల్లాకులవారిపాలెం వద్ద నిర్మానుష్యంగా జాతీయ రహదారి

పెరవలి: భానుడి భగభగలకు వడగాడ్పులు తోడవ్వడంతో రహదారులు నిర్మానుష్యంగా మారాయి. గత మూడు రోజులుగా సూర్యుడు నిప్పుల వర్షం కురిపించటంతో ప్రజలు విలవిల్లాడుతున్నారు. రేయింబవళ్లు తేడా లేకుండా ఉక్కపోతతో అల్లాడుతున్నారు. పెరవలి మండలంలో గత మూడు రోజులుగా 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో ప్రజలు ఉపశమనం పొందేందుకు జ్యూస్‌లు, శీతల పానీయాలను సేవించడం అధికంగా కనిపించింది. ఉదయం 8 గంటలకే వడ**గాడ్పులు వీయడంతో వ్యాపార సంస్థలూ మూతపడ్డాయి. గ్రామాల్లో అప్రకటిత విద్యుత్ కోతల వల్ల ప్రజలు ఇళ్లల్లో ఉండలేక, వీధిలోకి రాలేక అవస్థలు పడ్డారు. చిన్న పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వృద్ధులు చెట్ల కింద సేదతీరడం** కనిపించింది. లోఓల్టేజీతో ఫ్యాన్లు కాలిపోవటం, ఏసీలు పనిచేయకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గృహ సామాగ్రి వేడెక్కిపోతున్నాయని గగ్గోలు పెడుతున్నారు. ఎండ తీవ్రత కారణంగా నిత్యం రద్దీగా ఉండే జాతీయ రహదారులపై వాహనాలను ఎక్కడికక్కడ నిలిపివేస్తున్నారు. రోడ్లు నిర్మానుష్యంగా మారాయి.



ఉపశమనం కోసం తాటిముంజెలను కొనుగోలు చేస్తున్న దృశ్యం



పెరవలిలో శీతల పానీయాలు తాగుతున్న మహిళలు



ఎండ ధాటికి పెరవలిలో జ్యూస్‌లు తాగుతున్న బాటసారులు

చలివేంద్రం ప్రారంభం

నల్లజర్ల: ప్రకాశరావుపాలెంలో వైజ్ ఇంజినీరింగ్ కళాశాల బస్టాప్ వద్ద ఎన్ఎస్ఎస్ విద్యార్థులు గురువారం మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రయాణికులు, వాహనదారుల దాహార్తి తీర్చేందుకు ఈమజ్జిగ చలి వేంద్రాన్ని ఏర్పాటు చేసామని వేసవి ముగిసే వరకు ఈ చలివేంద్రం కొనసాగుతుందని విద్యార్థులు తెలిపారు. కళాశాల అధ్యాపకులు ఏఎస్ ప్రసాద్ శిబిరాన్ని ప్రారంభించగా హెచ్ఓడీలు హేమంత్, శంకర్, మురళీ, ఏఓ ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నిడదవోలు డివిజన్
90102 23729 (కొవ్వూరు)
90100 51493 (నిడదవోలు)
90100 68395 (గోపాలపురం)

Office mail : tpgadvt@gmail.com